

రేపే నవోదయ పరీక్ష

శనివారం జరిగే వర్గల్ నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

వివరాలు 8లో ▸



పుచ్చసాగు.. రైతుల మొగ్గు

పుచ్చ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

వివరాలు 8లో ▸



దిగుబడికి కీలకం..

జిల్లాలో 89.366 వేల ఎకరాల్లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఖేడ్ విద్యార్థులు



ఉపాధ్యాయులతో రగ్బీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న విద్యార్థులు

నారాయణఖేడ్: త్వరలో జరుగనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఖేడ్ మండలంలోని చాప్టా(కె)జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సుమిత్ర, విక్రాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.నర్సింహులు మీడియాకు వెల్లడించారు. మంచిర్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని అక్కడ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులతోపాటు వారికి తర్ఫీదునిస్తూ ప్రోత్సహించిన పీడీ మారుతిలను ఘనంగా సన్మానించారు.

అర్హులైన వారందరికీ ఇళ్లు

జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతి



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న చలపతి

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరవుతాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతి స్పష్టం చేశారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో గురువారం ఇందిరమ్మ పథకంలో మంజూరైన ఇళ్లకు సంబంధించిన స్థలాలను ఆయన పరిశీలించారు. వివరాలను లబ్ధిదారులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇంటి స్థలం ఇళ్లు నిర్మించుకునే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత లేని వారికి ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, భద్రయ్యస్వామి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని గెలిపించండి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



ప్రైవేట్ కళాశాలలో ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

జోగిపేట(అందోల్): ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి విజ్ఞప్తి చేశారు. జోగిపేట పట్టణంలో వివిధ డిగ్రీ కాలేజీలు, ప్రైవేట్ పాఠశాలల్లో డిగ్రీ పొందిన టీచర్స్, సిబ్బందిని గురువారం కలసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూరు రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ. 2 లక్షల ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని చింతల్‌ఘాట్ గ్రామానికి చెందిన నవీన్‌కు అత్యవసర చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు రూ.2లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నవీన్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నవీన్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, నాయకులు సాలోమన్‌లు ఉన్నారు.

2.15 మిలియన్ యూనిట్లు

వేసవికి పెరగనున్న విద్యుత్ వినియోగం

- అంచనా వేసిన విద్యుత్‌శాఖ
- సాధారణ రోజుల్లో 15.5 మిలియన్ యూనిట్లు..
- గతేడాది ఏప్రిల్‌లో 17.65 ఎంయూల వినియోగం
- లోడ్‌ను తట్టుకునేందుకు ముందుజాగ్రత్త చర్యలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఈ వేసవి సీజనులో సాధారణ వినియోగం కంటే సుమారు 2.15 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ వినియోగం పెరుగుతుందని విద్యుత్‌శాఖ భావిస్తోంది. గతేడాది వేసవిలో పెరిగిన డిమాండ్ ఆధారంగా ప్రాథమికంగా ఈ అంచనాకు వచ్చింది. ఎండల తీవ్రత అధికంగా ఉండే మే మాసం కంటే..మార్చిలోనే ఎక్కువ విద్యుత్ డిమాండ్ ఉంటుందని గతేడాది లెక్కలను బట్టి తేలింది. మార్చిలో ఎండల తీవ్రతను తట్టుకునేందుకు ఏసీ, కూలర్లు, ఫ్యాన్ల వాడకంతో గృహ విద్యుత్ డిమాండ్ పెరగడంతో పాటు, వరి వంటి పంటలకు సాగునీరు ఎక్కువగా అవసరం ఉండటంతో బోర్లు ఎక్కువగా నడుస్తాయి. దీంతో ఎండలు తీవ్రంగా ఉండే మే నెల కంటే మార్చిలోనే ఎక్కువ విద్యుత్ డిమాండ్ ఉంటుందని తేల్చారు.

15శాతం వినియోగం పెరిగే అవకాశం

జిల్లాలో సాధారణ రోజుల్లో విద్యుత్ వినియోగం రోజుకు 15.5 మిలియన్ యూనిట్లు కాగా, 2024 మార్చిలో ఈ వినియోగం ఏకంగా 17.65 మిలియన్ యూనిట్లకు పెరిగినట్లు విద్యుత్‌శాఖ గుర్తించింది. అంటే సాధారణం కంటే సుమారు 14% (2.15 మిలియన్ యూనిట్లు) పెరిగినట్లు తేలింది. ఈసారి ఇంకా ఎక్కువగా 15% వరకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నట్లు గుర్తించారు. కాగా, 2024 ఏప్రిల్‌లో 17.57 మిలియన్ యూనిట్లు, మేలో 16.00 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అయినట్లు గుర్తించారు. గతేడాది మే రెండో వారం నుంచి వాతావరణం కొంత చల్లబడింది. అకాల వర్షాలు కురియడంతో విద్యుత్ వినియోగం పెరుగుదల తగ్గడానికి కొంత కారణమని చెబుతున్నారు.

8.20 లక్షల విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 8.20 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు 6.14 లక్షలు ఉండగా, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 1.06 లక్షలు ఉన్నాయి. వాణిజ్యపర కనెక్షన్లు 76,938 ఉండగా, పరిశ్రమలకు సంబంధించి హెచ్‌టీ 5,504 కనెక్షన్లున్నాయి. ఇవి కాకుండా ఇతర కనెక్షన్లు 17,427. జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉండటంతో ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో పరిశ్రమల విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. అయితే ఈ పరిశ్రమల విద్యుత్ వినియోగంలో చెప్పుకోదగినంత హెచ్చుతగ్గులేమీ ఉండవు. కేవలం వ్యవసాయ, గృహవిద్యుత్ వినియోగమే వేసవిలో పెరుగుతుంది.

సరఫరాలో అంతరాయం లేకుండా..

వేసవిలో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరగడంతో సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. పెరగనున్న లోడ్‌ను తట్టుకునేందుకు కొత్త ఫీడర్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నామని ఆ శాఖ ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సురక్షిత భవనాలకు అంగన్‌వాడీ కేంద్రాలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ కేంద్రాలను సురక్షిత భవనాల్లోకి మార్చి, కొనసాగించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ, సీడీపీవోలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ...అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు, టీచర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాల్లో టాయిలెట్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. టాయిలెట్స్‌కు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి, మిషన్ భగీరథ త్రాగునీరు ఇబ్బందులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీరోజు విధిగా తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. నారాయణఖేడ్‌లో జరిగిన సంఘటన జిల్లాలో మరి ఎక్కడ జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేషనల్ డి–వార్మింగ్ డేకు అన్ని ఏర్పాట్లు

ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం (డి–వార్మింగ్ డే)–2025 కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మాత్రలు1నుంచి 19 సంవత్సరాల వయస్సుగల 4,05,207మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లలో ఈ మాత్రల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.గాయత్రీదేవి, జెడ్పీసీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా, ఈఈ పీ ఆర్.జగదీశ్, మిషన్ భగీరథ ఈఈ పాష, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ల ఆధునీకరణకు రూ.4.39కోట్లు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో విద్యుత్ లైన్లు, ఫీడర్ల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.4.39 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి వెల్లడించారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో విద్యుత్ లైన్ల ఆధునీకరణ, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లోవోల్టేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు గురువారం ఆయన విలేకరులకు తెలిపారు. తాను కోరిన వెంటనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయడం పట్ల ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో దివంగత కిష్టారెడ్డి హయాంలో అనేక సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని, తిరిగి విద్యుత్ లైన్ల ఆధునీకరణ, లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి నిధులు విడుదల కావడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభి వృద్ధి కేంద్రంలో జరిగిన సీఎల్పీ సమావేశానికి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో కలసి సంజీవరెడ్డి హాజరయ్యారు.

కాంగ్రెస్‌తోనే బీసీ రిజర్వేషన్ల పెంపు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, సోనియా, రాహుల్, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలతో ఏర్పాటు చేసి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ... ప్యారానగర్ డంప్ యార్డ్ ఘనత మాజీమంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. ప్రస్తుతం నర్సాపూర్, గుమ్మడిదల, రామచంద్రపురం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రిని విమర్శించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పల్లవి

జోగిపేట(అందోల్): బాలికల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పల్లవి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి క్లాక్ టవర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి, అందోలు ఆర్డీవో పాండు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్.తిరుపతి పాల్గొన్నారు.

ఆలు రైతు కష్టం.. కన్నీటిపాలు

పంట చేతికొచ్చాక ధర పతనం

- జోరుగా సాగుతున్న ఆలుతీత పనులు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడులే కారణం



ఆలుగడ్డ పంట ఏరుతున్న వ్యవసాయ కూలీలు

సంగారెడ్డి జోన్: పంట సాగు చేసే సమయంలో మంచి ధర ఉండటంతో ఎంతో ఆశతో లాభాలు పొందవచ్చని పంట సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఆలుగడ్డ పంట సాగు చేసిన రైతుల పరిస్థితి ఇది. యాసంగి సీజన్‌లో భాగంగా వాణిజ్య పత్తి పంట అనంతరం నీటి సౌకర్యం ఉన్న రైతులు ఆలుగడ్డ పంటను సాగు చేశారు. జిల్లాలో ఎక్కువగా జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో ఎక్కువగా పంటను సాగు చేస్తుంటారు. పంట సాగుకు సరైన విధంగా వాతావరణం అనుకూలించినప్పటికీ మార్కెట్‌లో మాత్రం ధర లభించకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు.

జిల్లాలో రెండు వేల ఎకరాల్లో సాగు..

యాసంగి సీజన్ లో భాగంగా జిల్లాలో 2000 ఎకరాల వరకు ఆలుగడ్డ పంటను సాగు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పంట సాగు చేసే సమయంలో క్వింటాలు ధర రూ.3,500కి పైగా ఉండటంతో రైతులు ఎంతో ఆశగా ఆలుగడ్డ పంటను సాగు చేశారు. అయితే కొన్ని రోజులుగా ఆలుగడ్డ పంట ధర నిలకడగా లేకపోవడంతో పాటు పతనం అవుతుంది. దీంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఆలు అధికంగా దిగుమతి కావడంతో మద్దతు ధర కూడా లభించడంలేదు. దీంతో సాగుచేసిన రైతులు ధర పెరుగుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తుండగా మరి కొంత మంది వచ్చిన ధరకే అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పంట నాణ్యతను బట్టి క్వింటాలు ధర రూ.1,100 నుంచి రూ.1,500వరకు పలుకుతోంది.

పంట సాగుకు పెట్టుబడులు అధికం

పంట సాగుకు ప్రతీఏటా పెట్టుబడులు అధికమవుతున్నాయని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం వేసిన నాటి నుండి చేతికి వచ్చి మార్కెట్‌కు తరలించేంతవరకు ఒక ఎకరానికి సుమారు రూ.80వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు.



ఆలుగడ్డలు

కోల్డ్ స్టోరేజ్ లేక ఇబ్బందులు

అందుబాటులో కోల్డ్ స్టోరేజ్ ఉంటే పంట నిల్వ చేసుకుని మద్దతు ధర ఉన్నప్పుడు అమ్ముకోవడానికి వీలుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం విత్తనం భద్రపరచుకునేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

మద్దతు ధర లేకపోవడంతో



ఆలుగడ్డ పంట సాగు చేసే సమయంలో మంచి ధర ఉంది. పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్‌లో ధర పతనం కావడంతో నష్టాలు చూడాల్సి వస్తుంది.

–సంగమేశ్వర్, ఆలు రైతు, బర్దిపూర్, మం. ఝరాసంగం

సప్లై అధికంగా ఉండటంతోనే



ఆలుగడ్డ పంట మార్కెట్‌లో అధికంగా ఉండటంతోనే డిమాండ్ పడిపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి ఆలు పంట అధికంగా దిగుమతి కావడంతో ధరలు తగ్గుతున్నాయి. శీతల గిడ్డంగులు ఉంటే ఈ పరిస్థితి నెలకొనేది కాదు.

–సోమేశ్వర్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, సంగారెడ్డి.

పనులు ఆపకపోతే పోరాటమే



వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతాప్రభాకర్ తదితరులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

సంగారెడ్డి : గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంప్‌యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే పోరాటం చేయక తప్పదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు. గ్రామస్తులు ఆందోళన చేస్తుంటే పోలీసులతో గ్రామాన్ని దిగ్బంధం చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...పచ్చని అడవి మధ్యలో డంపింగ్ యార్డు నిర్మించడం అంటే ప్రకృతిని ధ్వంసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిర్మాణాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్యారానగర్ గ్రామ ప్రజలకు జీవనాధారం వారి వ్యవసాయభూములేనని, ఆ భూముల్లో డంపింగ్ యార్డ్ నిర్మాణాలు చేపట్టి వారి ఉసురు తీయవద్దని కోరారు. బాధిత రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ నిర్మాణాన్ని నిలివేయడంతోపాటు రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నిర్మాణం ఆపకుంటే బీఆర్ఎస్ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గుమ్మడిదల బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌వోకు వినతి పత్రం

సంగారెడ్డి జోన్: గుమ్మడిదల మండల పరిధిలోని ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ నిర్మించే డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలని నర్సాపూర్, సంగారెడ్డి ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతాప్రభాకర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో పద్మజ రాణికి వినతి పత్రం అందించారు.

పోలీసుల పహారాలో ప్యారానగర్

- రెండవ రోజు కొనసాగుతున్న 144 సెక్షన్
- సెల్‌టవర్, వాటర్ ట్యాంకులపై ఎక్కి గ్రామస్తుల నిరసనలు



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): పోలీసు పహారాలో ప్యారానగర్, నల్లవల్లి గ్రామాలున్నాయి. పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ రెండవ రోజు కొనసాగుతోంది. గుమ్మడిదల, నల్లవల్లి గ్రామంలో డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు ఆపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలసి స్థానిక రైతులు అఖిలపక్ష నాయకులు గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల యువకులు కొంతమంది సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. మంబాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు స్థానిక వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక నాయకులు నచ్చ చెప్పడంతో కిందికి దిగారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసనకు సిద్ధమైన ఉమ్మడి జిన్నారం మండలాల బీజేపీ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి కంది మండలం బేగంపేట పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. అదుపులోకి తీసుకున్న నాయకులకు కనీసం తాగునీరు కూడా ఇవ్వకపోవడంతో పోలీసులు నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది ప్రజాపాలన కాదు, ఈ ప్రాంత ప్రజల ప్రాణాలను హరించే పాలన కొనసాగిస్తుందని నాయకులు మండిపడ్డారు. పోలీసు బలగాలను మోహరించి, అక్రమ అరెస్టులు చేసినా తమ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని ఆపకపోతే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

అంత్యక్రియలకు వెళ్లిన వారిపై తేనె టీగల దాడి

నంగునూరు(సిద్దిపేట): అంత్యక్రియలకు వెళ్లిన బంధువులపై తేనె టీగలు దాడి చేసిన ఘటన నంగునూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముత్యాల రాజయ్య (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. సాయంత్రం గ్రామ శివారులోని శ్మశాన వాటికకు అంత్యక్రియలకు వెళ్తున్న మృతుడి భార్య ఎల్లవ్వతోపాటు 40 మందిపై తేనెటీగలు దాడి చేశాయి. గాయాలైన కొందరిని నంగునూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మరికొందరు రాజెల్లయ్య, రాకేష్, చంద్రయ్య, భాగ్యలక్ష్మి, లింగం, మంజుల, ఉప్పలవ్వను మెరుగైన చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడైన రాజెల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

పేకాట కేసులో నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: పేకాట కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ఆరుగురిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్టు సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ గురువారం తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. 2018లో ఎన్సాన్‌పల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న కొలిమి రవీందర్, పంది పర్శరాములు, డాకిని మల్లేశం, ఐలాపురం లక్ష్మణ్, కొలిమి మల్లేశం, పేరెల్లి రమేశ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. కొద్ది రోజులుగా కోర్టుకు హాజరుకాకపోవడంతో జడ్జి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో ఆరుగురిని అదుపులోకి తీసుకొని గురువారం కోర్టులో హాజరుపర్చగా వారికి జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో కరీంనగర్ జైలుకు పంపించినట్టు తెలిపారు.

చెరకు తోట దగ్ధం



దగ్ధమవుతున్న చెరకు తోట

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని చెరకు తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలోని హద్నూర్‌లో గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. హద్నూర్ గ్రామానికి చెందిన మల్లికార్జున్, బస్వరాజ్ చెరకు తోటలను సాగు చేశారు. గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు చెరుకు తోటకు నిప్పంటుకొని కాలిపోయింది. క్రమంగా సమీపాన గల కౌలు రైతు యాదుల్ తోటకు మంటలు వ్యాపించాయి. దీంతో భారీ ఎత్తున మంటలు చెలరేగి ముగ్గురు రైతులకు సంబంధించి సుమారు 11 ఎకరాల వరకు పంట దగ్ధమైంది. చెరకు తోటలతోపాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఇంట్లో కుళ్లిన మృతదేహం

తూప్రాన్: స్థానికుల సమాచారంతో ఓ ఇంట్లో కుళ్లిన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటన మున్సిపల్ కేంద్రంలో ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన వడియారం మల్లేశ్(42) భార్య జ్యోతితో గొడవపడి కొంత కాలంగా ఒంటరిగా నివసిస్తున్నాడు. జ్యోతి కుమారుడితో కలిసి పట్టణంలో అద్దెకు ఉంటుంది. వారం రోజుల నుంచి మల్లేశ్ కనిపించకుండా పోయి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు భార్య జ్యోతికి సమాచారం ఇచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి చూసేసరికి మల్లేశ్ మృతి చెంది మృతదేహం కుళ్లిపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రేపే నవోదయ పరీక్ష

- 9,11 తరగతుల్లో ప్రవేశం కోసం నిర్వహణ
- మొత్తం 2,610 మంది విద్యార్థులు, 10 పరీక్ష కేంద్రాలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన సిబ్బంది
- వివరాలు వెల్లడించిన నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయలో 2025–26 విద్యాసంవత్సరం 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు గజ్వేల్, ప్రజ్ఞాపూర్, వర్గల్‌లో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణ తదితర అంశాలపై గురువారం వర్గల్ నవోదయలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఏర్పాట్ల వివరాలను నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ వెల్లడించారు.

పరీక్షకు 2,610 మంది విద్యార్థులు

- ఉమ్మడి జిల్లా నుంచి తొమ్మిదో తరగతి పరీక్షకు 989 విద్యార్థులు, 11వ తరగతి పరీక్షకు 1,621 కలిపి మొత్తం 2,610 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.
- 11వ తరగతి విద్యార్థులకు 6, 9వ తరగతి విద్యార్థులకు 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఒక సెంటర్ సూపరింటెండెంట్, ఒక సెంటర్ లెవల్ అబ్జర్వర్ ఉంటారు. 24 మంది విద్యార్థులకు ఒక గది, ఒక ఇన్విజిలేటర్ ఉంటారు.
- 11వ తరగతికి శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 9వ తరగతికి ఉదయం 11.15 గంటల నుంచి 1.45 వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షకు అర గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలి.
- విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్ (అడ్మిట్‌కార్డు), రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ తీసుకొని రావాలి. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ వివరించారు.

జిరాక్స్ సెంటర్లు మూసివేత

జిల్లాలోని నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద శనివారం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, సమీప జిరాక్స్ సెంటర్లు మూసేయాలని సూచించారు.

ఇవే పరీక్ష కేంద్రాలు

ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు నవోదయ ప్రవేశ పరీక్ష రాసేందుకు 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. గవర్నమెంట్ హైస్కూల్ బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్ గజ్వేల్, జెడ్పీ హైస్కూల్ బాయ్స్ ప్రజ్ఞాపూర్, సాయి జీడీఆర్ హైస్కూల్ గజ్వేల్, సెంట్ జోసెఫ్ బాలికల హైస్కూల్ గజ్వేల్, సెంట్ పీటర్స్ హైస్కూల్ తూప్రాన్ రోడ్ గజ్వేల్, జవహర్ నవోదయ విద్యాలయం వర్గల్, జెడ్పీహెచ్ఎస్ బాలికల ఎడ్యుకేషన్ హబ్ గజ్వేల్, జెడ్పీహెచ్ఎస్ ఆర్అండ్ఆర్ కాలనీ గజ్వేల్, తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ బాలికల ముట్రాజ్‌పల్లి, కేజీ అండ్ పీజీ బాలికల ఎడ్యుకేషన్ హబ్ గజ్వేల్, సెంట్ మేరీస్ విద్యానికేతన్ ప్రజ్ఞాపూర్ కేంద్రాల్లో పరీక్ష జరుగుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

9న సూర్య నమస్కారాల ప్రదర్శన

సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మినీ స్టేడియంలో 9న ఉదయం 6 గంటలకు శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సిద్దిపేటలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు మాట్లాడారు. గతేడాది నిర్వహించిన రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో తెలంగాణ నలుమూలల నుంచి యోగా సాధకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఈసారి కూడా లక్షకు పైగా సూర్య నమస్కారాలను ప్రదర్శించి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదు చేయడానికి సంకల్పించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రిజిస్ట్రేషన్ చేసుకొని సూర్య నమస్కారాలు పాల్గొనాలన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న వారికి మెడల్, సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలు..

రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాలు పోటీలు కూడా ఇదే వేదికగా జరుగుతాయన్నారు. 25 ఏళ్ల లోపు, 25 ఏళ్ల పైబడిన వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లోని విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రత్యేక మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారతీయ స్వాభిమాన్ ట్రస్ట్ ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, చిప్ప ప్రభాకర్, స్వామి,అంజయ్య, రాములు, హరిప్రసాద్, బసవ రాజ్ కుమార్, కళ్లపల్లి శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, తోట సతీశ్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం పొందాలి

లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి



సిద్దిపేటజోన్: జిల్లా న్యాయ సేవ సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, న్యాయమూర్తి స్వాతి రెడ్డి సూచించారు. గురువారం బాల సదనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. బాల సదనం పిల్లలకు ఏ సమస్య ఉన్నా తెలపాలన్నారు. బాల కార్మికులు ఉంటే 15100 హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము, బాల సదనం సూపరింటెండెంట్ మమత, పాల్గొన్నారు.

యువకుడి అస్థి పంజరం గుర్తింపు



యువకుడి అస్థి పంజరం

హవేళిఘణాపూర్(మెదక్): 20 ఏళ్లు పైబడిన యువకుడి అస్థి పంజరం పోలీసులు గుర్తించిన ఘటన మండల పరిధిలో గల బీ.తిమ్మాయిపల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. హవేళిఘణాపూర్ ఎస్‌ఐ సత్యనారాయణ రెడ్డి కథనం మేరకు.. బీ.తిమ్మాయిపల్లి అటవీ ప్రాంతంలో మనిషి అస్థి పంజరం ఉన్నట్లు గ్రామస్తులు సమాచారం అందించడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అస్థి పంజరాన్ని మెదక్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి పరీక్షించగా 20 ఏళ్ల పైబడిన యువకుడివిగా వైద్యులు నిర్ధారించారు. అస్థి పంజరాన్ని ఖననం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అస్థి పంజరం పడి ఉన్న స్థలంలో ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో ఘటనపై ఎలాంటి సమాచారం తెలియలేదని పేర్కొన్నారు. యువకులు తప్పిపోయినట్లయితే హవేళిఘణాపూర్ పోలీసుల నంబర్ 87126 57921కు సమాచారం అందించాలని తెలిపారు.

కుంభమేళాకు వెళ్లొస్తూ అనంతలోకానికి

- అయోధ్య వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
- మెదక్ జిల్లా వాసి మృతి, పలువురికి గాయాలు



రవీందర్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): కుంభమేళాను పురస్కరించుకొని పుణ్యస్నానానికి వెళ్లి తిరిగొస్తున్న మెదక్ జిల్లా వాసులు అయోధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆగిన లారీని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలు అయ్యాయి. గురువారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ పరిధిలోని డిల్లాయికి చెందిన మెరుగు రవీందర్ యాదవ్(43) అతడి కుటుంబ సభ్యులు, బావమర్ది కుటుంబసభ్యులు మొత్తం 8 మంది కారులో మూడు రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహాకుంభమేళకు వెళ్లారు. కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించి ప్రయాగరాజ్ నుంచి అయోధ్యకు వెళ్తున్నారు. బుధవారం రాత్రి మార్గమధ్యలో ఉండగా రోడ్డుపై ఆగిన ఉన్న లారీని వీరి కారు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రవీందర్ యాదవ్ అక్కడికక్కడే మృతి చెందగా, అతడి ఐదేళ్ల కుమారుడు కృత్విక్‌కు ఎడమ చేయి విరిగింది. మిగితా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడు ఓ ప్రవేట్ పరిశ్రమలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ విషయం తెలియడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అప్పుల బాధతో ఉరేసుకొని ఇద్దరు ఆత్మహత్య

దౌల్తాబాద్ (దుబ్బాక): అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దౌల్తాబాద్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ (41) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలె వ్యవసాయంలో నష్టం రావడంతో అవసరాలకు అప్పులు చేశాడు. ఇదే విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై న సత్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య తుమ్మల రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనంతరావుపల్లిలో మరొకరు



నాగరాజు(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని అనంతరావుపల్లిలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దార నాగరాజు(38)కు భార్య రాజమణి, వృద్ధ తల్లి పెంటవ్వతోపాటు ఇద్దరు కుమారులున్నారు. నాగరాజు తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ, కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. పంటల సాగుకు, ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదనకు గురై బుధవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి పొలం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సింగూరు ప్రాజెక్టులో ఈతకెళ్లి వ్యక్తి మృతి



మౌలాన మృతదేహం

పుల్‌కల్(అందోల్): ఈత కొట్టడానికి వెళ్లి సింగూరు ప్రాజెక్టులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి పట్టణం ప్రగతి నగర్‌కు చెందిన మహమ్మద్ మౌలాన (60) గురువారం సింగూర్ ప్రాజెక్ట్ చూడటానికి వచ్చి దిగువ భాగం నీటిలో స్నానానికి దిగాడు. నీటిలో ఈత కొడుతుండగా ఊపిరాడక పోవడంతో మృతి చెందాడు. నీటిలో మునిగి పోవడాన్ని గమనించిన తోటి పర్యాటకులు డ్యామ్ అధికారులకు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో పుల్‌కల్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి కేసు నమోదు చేశారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన మల్లయ్య (82) గురువారం గ్రామంలోని బస్‌స్టాప్ నుంచి నడుచుకుంటూ రామ్ మందిర్ వెళ్లేందుకు రోడ్డు దాటుతూ డివైడర్‌పై నిలబడ్డాడు. ఇదే సమయంలో సంగారెడ్డి వైపు నుంచి పటాన్ చెరు వైపు వస్తున్న కారుకు వేగంగా వచ్చిన టిప్పర్ తగిలింది. కారు కంట్రోల్ తప్పి డివైడర్ పైకి ఎక్కి మల్లయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు.

పొలం పనులకు వెళ్లి వస్తుండగా..

భైక్‌పై నుంచి పడి యువకుడు మృతి



మహేశ్ మృతదేహం

దుబ్బాకటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్‌పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ మహేశ్(32) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లి తిరిగొచ్చే క్రమంలో తిమ్మక్‌పల్లి గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

పరిశ్రమ ప్రహరీని ఢీకొట్టిన బైక్

యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరుకి చెందిన రవీందర్(22) బైక్‌పై ప్రవీణ్ అనే యువకుడిని ఎక్కించుకొని బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూర్ బైపాస్ రహదారిలో వెళ్తున్నాడు. బైక్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి ఓ పరిశ్రమ ప్రహరీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే రవీందర్ మృతి చెందగా, ప్రవీణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యం

బీటెక్ విద్యార్థి



దీపక్

పటాన్‌చెరు టౌన్: బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన దీపక్ బీటెక్ ఫోర్త్ ఇయర్ చదువుతున్నాడు. 4న కుటుంబ సభ్యులతో తాను ప్రయాగ్ రాజ్ కుంభమేళకు వెళ్తున్నానని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వద్దన్నారు. 5న ఉదయం లేచి చూసేసరికి దీపక్ కనిపించలేదు. ఫోన్ కూడా ఇంట్లోనే పెట్టి వెళ్లాడు. స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీపక్ అన్న సాయి మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భార్య మందలించిందని భర్త..

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీకి చెందిన రాకేశ్ (33) వేరే అమ్మాయితో మాట్లాడుతున్నాడని తెలిసిన భార్య హేమలత 2వ తేదీన గొడవ పడింది. దీంతో రాకేశ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై గురువారం హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి బాలుడు



బాలుడు మధు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): బాలుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. నిజాంపూర్ గ్రామానికి చెందిన జుంజుర్ మధు(13) సదాశివపేట పట్టణంలోని మోనో ప్లే స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. బుధవారం రోజు మాదిరిగానే స్కూల్ నుంచి వచ్చి గ్రామంలో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. అనంతరం ఇంటికొచ్చిన కొద్దిసేపటికే బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బాలుడు ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు నలుపు రంగు ప్యాంట్, నీలం రంగు షర్ట్ ధరించి ఉన్నాడు. బాలుడిని ఎవరైనా గుర్తిస్తే 87126 56721 నంబర్‌ను సంప్రదించాలని సీఐ కోరారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కూలీ పనికెళ్లి మహిళ



కొన్యాల లత

సంగారెడ్డి క్రైమ్: మహిళా అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణంలోని భవానీ కమాన్‌కి చెందిన కొన్యాల లత (36) 2వ తేదీన కూలీ పని నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త, కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యతో గొడవపడి భర్త

సంగారెడ్డి పట్టణంలోని విజ యనగర్ కాలనీకి చెందిన ఇప్ప దుర్గయ్య 3వ తేదీన ఇంట్లో భార్యతో గొడవ పడి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆ చూకీ లభించలేదు. దుర్గయ్య భార్య ఇప్ప అమృత గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుచ్చకాయ సాగు.. రైతుల మొగ్గు

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

- గతేడాది 300 ఎకరాలు, ప్రస్తుతం 500 ఎకరాల్లో..
- పంట కాలవ్యవధి 65 రోజులు మాత్రమే
- పొలం వద్దకే వస్తున్న వ్యాపారులు
- తప్పిన మార్కెట్ కష్టాలు





పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ తదితరులు

జహీరాబాద్ టౌన్: సీజన్లతో సంబంధం లేకుండా పుచ్చకాయలను ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. వేసవి కాలంలో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది. మంచి లాభాలు తెచ్చి పెడుతోంది. వ్యాపారులు పొలాల వద్దకు వచ్చి పంటను కొంటున్నారు. దళారుల బెడద లేకుండా ఆదాయం వస్తుండడంతో రైతులు వాటర్ మిలాన్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రతీ ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతోంది. జిల్లాలో అధికంగా పత్తి, సోయా, కంది తదితర పంటలు లక్షల ఎకరాల్లో సాగువుతాయి. ఏడాది పొడుగు కష్టపడి, వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గిట్టుబాటు ధర లేక దళారుల బెడదతో నష్టపోతున్నారు. కొంత మంది రైతులు పంట మార్పిడి విధానాన్ని ఎంచుకొని డిమాండ్ ఉన్న పంటల సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వేసవిలో అధికంగా వినియోగించే పుచ్చకాయ సాగుపై దృష్టి పెట్టారు. ప్రయోగాత్మకంగా ప్రారంభమైనా లాభాలు తీసుకొచ్చి పెడుతుండడంతో సాగు చేయడానికి రైతులు ముందుకొస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

యాసంగిలో సాగు చేస్తున్న పుచ్చకాయ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడు వస్తాయని ఏరువాక కేంద్ర సంగుపేట శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ పేర్కొన్నారు. నీటి తడులు పరిమితికి మించి ఇవ్వరాదని, సూక్ష్మ పోషకాలు అందించే ఎరువులు వేసుకోవాలన్నారు. పిందె రాలకుండా ఫ్లూ పైరాడి ఫోరాన్ మందును పిచికారీ చేయాలన్నారు. హైబ్రిడ్ రకాల విత్తనాల వద్ద పెట్టుబడి అధికంగా ఉంటుందన్నారు. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పంటల పరిశోధన సంస్థ (ఐఏఎస్) వారు పరిచ యం చేసిన విత్తనంతో అధిక దిగుబడి వస్తుందన్నారు. మార్కెట్‌లో అమ్మడానికి కూడా సులభంగా ఉంటుంది. విత్తన పెట్టుబడి కూడా చాలా వరకు తగ్గుతుంది. హైబ్రిడ్‌తో సమానంగా పంట దిగుబడి వస్తుంది.. చక్కెర శాతం 12 నుంచి 15 వరకు ఉంటుందన్నారు.

500 ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది 500 ఎకరాల్లో పంట సాగువుతుందని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొన్నారు. గతేడాది సుమారు 300 ఎకరాల్లో రైతులు పంట సాగు చేశారు. ముఖ్యంగా జహీరాబాద్ నియోజకవర్గంలో రైతులు అధికంగా వేశారు. పంట కాలవ్యవధి 65 రోజులు మాత్రమే ఉండడంతో కొందరు మూడో పంటగా మరి కొంత మంది రెండో పంటగా వేస్తున్నారు. మామిడి తోటలో అంతర పంటగా కూడా సాగు చేస్తున్నారు. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు పంట సాగవుతుంది. పంట చేతికొచ్చే సరికి ఎకరాకి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. కిలో రూ.7 నుంచి రూ.8 అమ్మినా పెట్టుబడి పోనూ రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. పుచ్చకాయలకు మంచి డిమాండ్ ఉండటంతో వ్యాపారులు పొలం వద్దకు వచ్చి కొంటున్నారు. దీంతో రైతులకు దళారుల బెడద తగ్గింది.

నేటి నుంచి ఉర్సె షరీఫ్ ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ సమీపంలోని ఉర్సెషరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గాలో వారం రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉత్సవాల్లో భాగంగా 7వ తేదీ రాత్రి సాయంత్రం గంధం ఊరేగింపు, రాత్రి కవ్వాలి కార్యక్రమం, 9న పశువుల సంత, 10న ఖురేషీల గంధం, కవ్వాలీ పోటీలు, 11న కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. 12న న్యాల్‌కల్‌లో కూరగాయల సంత, 13న కవ్వాలి కార్యక్రమం, 14న ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ కమిటీ గురువారం మీడియాకు వెల్లడించింది. ఈ ఉత్సవాలకు ఝరాసంగం, రాయికోడ్, జహీరాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రజలు తరలి వస్తారు.